# రుద్ర

రచన:
బి. వి. డి.

"ఎక్స్‌క్యూజ్ మీ. మీరే బస్సు కోసం చూస్తున్నారో తెలుసుకోవచ్చా?"

చూపు మార్చుకొని అటు చూశాడు రావు. ఆ చూపుకు ఓ అమ్మాయి చిక్కింది!

సర్దుకొని చెప్పాడు.

"లక్కీ. థాంక్ గాడ్! నేనూ ఆ బస్సులోనే ప్రయాణం జేయాలి. మరోలా అనుకోక నా క్కాస్త సహాయం జేస్తారా?"

"చెప్పండి."—చటుక్కున అన్నాడు రావు.

"బస్సు ఆగ్గానే అంతా నెట్టుకుంటూ ఎగబ్రాకుతారుగా! నేను ఆడదాన్ని. సో మీరు ముందుగా బస్సులోనికి వెళ్ళి లోనికి వెళ్ళగలిగితే నాకో సీటు వుంచరూ? ప్లీజ్."

"తప్పక." హుషారుగా అనేశాడు రావు - ఆమె ఇచ్చిన చేతి రుమాలును అందుకుంటూ.

"బస్సు ఎన్నింటికి రావాలి?" వాచీలోకి చూస్తూ అడిగింది ఆమె.

రావు చెప్పాడు.

"సరైన టైముకు వస్తే మంచిది. ఏమో, కరెక్టుగా వస్తోందో రాదో...." ఆమె అంది వెంటనే.

రావు విన్నాడే తప్ప వేరే కామెంట్ ఏమీ జేయలేదు.

ఆమె క్షణమాగి ఏదో అంది—'ఏదో ఒకటి మాట్లాడాలి' అన్న భావం కన్పిస్తోంది ఆమె మాటల తీరును పరిశీలిస్తే! అది గుర్తించిన రావు చిరునవ్వుతో ఆమె చెప్పేది వింటున్నాడే తప్ప తనేం మాట్లాడ్డంలేదు? నిజానికి అతని చూపులు ఆమెను తడిమి తడిమి చిందులు వేస్తున్నాయి. అతని ఆలోచనలు పొంగి పొంగి పొర్లుతున్నాయి.

అప్పుడే బస్సు వచ్చింది!

అది ఆగి ఆగ్గానే అంతా ఒకేసారి ఎక్కే ప్రయత్నం జేయడంతో దానికి వున్నది ఒకే తలుపు కనుక రద్దీ ఎక్కువయింది అక్కడ....

అతి కష్టంతో ముఖ్యంగా కనీసం ఆమెకైనా సీటు చూపి పెట్టాలి, అన్న పట్టుదలతో బస్సులోనికి దూసుకుపోయాడు రావు.

ఆ ప్రయత్నంలోనే అతని షర్టు వెనుక భాగం కొంత మేరకు చిరిగి పోయింది. అది గుర్తించగలిగాడు. అయినా విచారించ లేదు!

ముందుగా తన మనసులో అనుకున్నట్లే వెనుక రెండు సీట్ల వరుస నొకదాన్ని లక్కీగా సంపాదించ గలిగాడు రావు!

సీట్లలో తన చేతి రుమాలుతో పాటు ఆమె చేతి రుమాలును కూడా వేసి కిటికీలో నించి తలను బయటకు పెట్టి ఆమె కోసం చూచాడు....

అంతే!—

'షాక్'కు గురైన వాడిలా అదిరిపోయాడు....

ఉక్కిరి బిక్కిరై పోతూన్న మనసుతో గొంతు పగలక క్రిందకు దిగే ప్రయత్నం జేశాడు రావు. కానీ లాభం లేక పోయింది. అంతా ఎక్కే ఆత్రంలో వున్నారే తప్ప దిగే వారికి చోటిచ్చే స్థితిలో ఎవరూ లేరు!

ఊపిరి బిగపట్టి కిటికీలో నించి బయటకు చూశాడు రావు తిరిగి!—

'ఈ పాటికి ఆమె చాలా దూరం వెళ్ళిపోయి వుండవచ్చు!'....

'ప్చ్.. రెండు బ్రీఫ్ కేసులు + ఒక వైర్‌బ్యాగ్ + వాటిలోని వస్తువులు....వెరశి 4 వేల రూ॥ల చిల్లర.... హుష్‌కాకి!'...

—ఇలా గొణుక్కుంటూ అసహనంగా కదులుతున్నాడు రావు. క్రిందకు దిగే అవకాశం ఇంకా అతనికి చిక్కడం లేదు—

* * *

ఆమె పేరు రుద్ర.

ఆమెకు లగ్జరీలైఫ్ అంటే ఎంతో ప్రీతి. అందుకు తగ్గ ఆర్థిక వసతులు ఆమెకు అందుబాటులో లేవు....

తన కోరికలు తీరాలన్న కాంక్షతో ఆమె వివిధ బస్సు స్టాండ్స్‌లో మాటు వేసి ప్రయాణీకులను గమనిస్తోంది. సరైన ప్రతిఫలం వుండగలదన్న నమ్మకం కుదరగానే ఆ ప్రయాణీకులను ముఖ్యంగా ఒంటరిగావున్న యువకుల్ని మోసం జేస్తుంటుంది....

ప్రతీ చోట ఒకే రీతిలో వుంటాయి ఆమె మోసాలు—

గమ్మత్తుగా మాటలు కలిపి, పిమ్మట తీయగా మాటాడుతూ—'సామాన్లు చూస్తూ వుంటాను. ముందు సీట్లు చూపి రండి.' అని చెప్తోంది తను మోసం జేయతలచిన వారితో.

వారు ఆ ప్రయత్నంలో వుండగానే ఆటోను పిలిచి వారి సామాన్లు దానిలోకి చకచకా ఎక్కించేసి చటుక్కున మాయమై పోతుంది ఆమె!

తర్వాత ఆ వూరును విడిచి పెట్టేస్తోంది. వేరే వూరులో ఓ లాడ్జీలో బస చేసి అప్పుడు ఆ సామాన్లు పరిశీలిస్తోంది. తనకు కావలసినవి అమ్మడానికి అందుబాటులో ఉన్నవి ఏరుకొని వాటిని తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌ల్లో వేసుకొని బజారుకు బయలుదేరుతోంది. అమ్మబడేవన్నీ అమ్మేసి మిగిలినవి కాస్తో కూస్తో ధర తగ్గిస్తూ అమ్మేస్తోంది— వివిధ చోట్ల తిరిగి ఏవ్విధమైన అనుమానంకు దారి ఇవ్వక అతి నేర్పుగా!

పిమ్మట ఆ వూరు వదిలిపోతుంది వెంటనే!—

* * *

ప్రక్కనుంచి సర్రున పోయి సడన్‌గా మలుపు తిరిగి అడ్డుగా ఓ మోటర్‌సైకిల్ ఆగడంతో టక్కున ఆపేశాడు డ్రయివర్ - ఆటోను.

ఆ ఆటోలో రుద్ర వుంది....

మోటర్‌సైకిల్ మీదనుంచి ఇద్దరు యువకులు దిగారు. చకచకా ఆటో వద్దకు వచ్చారు.

వాళ్ళను చూసీ చూడగానే రుద్ర శరీరంలోని అవయవాలన్నీ మూకుమ్మడిగా 'షాక్' అయ్యాయి. అయినా తమాయించుకో గలిగింది....

"ఏమిటి? ఏమిటిదంతా?" డ్రయివర్ వేపు చూస్తూ అడిగింది రుద్ర నిబ్బరంగానే.

"అతనికేం తెల్సు చెప్పడానికి. నన్ను అడుగు చెప్తాను." అన్నాడు ఓ యువకుడు.

"మర్యాదగా ఆ బ్రీఫ్‌కేసులు ఇలా యివ్వు." అన్నాడు మరో యువకుడు - అప్పటికే అతను చేతిలోకి కత్తి తీసుకున్నాడు తన కుడి మోకాలు అంచునుంచి,

ఇదంతా చూస్తున్న ఆటోడ్రయివర్ చెమటలు కక్కేస్తున్నాడు చడీ చప్పుడు లేకుండా!

"ఏమిటీ దౌర్జన్యం!? ...డ్రయివర్! ఆటోని పోనీ." గబగబా అంది రుద్ర.

డ్రయివర్ పరిస్థితిని గుర్తించిన ఆ యువకులు 'అతనివి ఎటాక్ జేయడం అనవసరం' అని భావించి చుట్టూ చూడు. అరిచినా వచ్చేవారు ఎవరూ లేరు. సో, వాటిని మాకు స్వాధీనం జేయి. లేదా " అన్నారు రుద్రతో కోరస్‌గా.

ఆమె ఏదో ప్రయత్నం జేయపోయింది! కానీ ఆ యువకులు ఆమెనుంచి రావు సామాన్ను విసురుగా లాక్కున్నారు....

రుద్ర ఇంకా ఆ షాక్‌లోనుంచి తేరుకో లేదు. ఆటో కదిలి పోయింది....

* * *

ఆటోను ఆపాడు డ్రయివర్ - పోలీసుస్టేషన్ ముందు. ఉలిక్కి పడింది రుద్ర! "ఇక్కడెందుకు ఆపావ్?"

"పోలీసు రిపోర్టు యివ్వండమ్మా! వాళ్ళు యింకా ఈ వూరు దాటి పోలేదు ..." చెప్పాడు డ్రయివర్.





జుపిటర్ వారి అత్యుత్తమమైన తయారింపులు!

- జుపిటర్ ఫైన్ • వెస్టన్ • షోర్
- కూల్ టెక్స్ • విజయ్ • కాస్మో

మీరు బనియన్లు కొనే ముందు "జుపిటర్" మార్కు వున్నదా అని చూచి కొనండి.

హైదరాబాదు - సికిందరాబాదు మినహా అన్ని చోట్లలో ఏజెంట్లు కావలెను.

తయారించువారు

Grams : JUPITER Phone: 20670

**Jupiter Knitting Company**

Lakshminagar Main Road,

TIRUPUR - 638 602.

డ్రయివర్ మీద తన పీక వరకూ తన్నుకు వచ్చింది కోపం. అయినా రుద్ర తమాయించుకుంటూ ఏదో మాట్లాడ ప్రయత్నించింది—

అంతలోనే స్టేషన్‌లో నించి ఇన్‌స్పెక్టర్ ఇన్‌ద్రసేన్ వడి-వడిగా బయటకు వచ్చి ఆటో వద్దకు జేరుకున్నాడు. అతని వెంటే రావు కూడా వచ్చాడు.

రావును చూస్తూనే రుద్ర కంగారుగా కదిలింది.

"ఈమే సర్." రావు సన్నగా అరవడం....

చెయ్యి పట్టుకొని రుద్రను ఇన్‌స్పెక్టర్ ఇన్‌ద్రసేన్ బయటకు లాగడం....

ఒకేసారి జరిగాయి —

డ్రయివర్ అస్తవ్యస్తంగా అందర్నీ మార్చి-మార్చి చూస్తుండగా అతనితో చెప్పాడు ఇన్‌స్పెక్టర్ ఇన్‌ద్రసేన్-

"నువ్వు కూడా స్టేషన్‌లోకి నడు...."

* * *

"అదిగో సర్...." ఆటోడ్రయివర్ లో గొంతుకతో అరిచాడు.

దాంతో అప్పటివరకు నక్కి-నక్కి ముందుకు సాగే దొంగలా కదిలే ఇన్‌స్పెక్టర్ ఇన్‌ద్రసేన్ మోటర్‌సైకిల్ ఒక్కసారి కొండ కొన మీదనుంచి జారిపడ్డ చిన్నరాయి కదలిక మాదిరిగా ముందుకు పోయింది—

కానీ అప్పటికే తమను పోలీసులు వెంటాడుతున్నట్టు గుర్తించేశారు ఆ ఇద్దరు యువకులు.

మరో ఆలోచనకు సందు ఇవ్వక చటుక్కున తమ మోటర్ సైకిల్‌ను తిప్పారు ఓ సందులోకి.

వారు 'అది తొందరపాటు చర్య'గా గుర్తించి దాన్ని సరిదిద్దుకొనేలోగా మోటర్ సైకిల్ బురదకాలువలోకి దొచ్చుకుపోతూ జారిపడింది అడ్డగా!

అయినా జోరుగానే లేచి నడుస్తున్నారు ఆ ఇద్దరు యువకులు!

వెనుకకు చూశారు—

'ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన్ తమవెంట పడాలంటే తన మోటర్‌సైకిల్ స్పీడ్‌ను మొదట కంట్రోల్ జేసుకోవాలి. పిమ్మట దాన్ని ఈ సందులోకి మలుపు తిప్పాలి. దానికి కనీసం నిముషమైనా పడుతోంది. అంతే కానీ తమలా అతను తొందరపడి మలుపు తిప్పడు! కనుక ఈలోగ ఆ ఇంట్లోనించి అవతల వీధిలోకి మారిపోయి !

—ఇలా సాగుతున్నాయి వాళ్ళ ఆలోచనలు. ఆలాగే కొనసాగివుండేవి వాళ్ళ చేతలుకూడా. మున్సిపాలిటి చెత్తల బండి వాళ్ళకు ఎదురుగావచ్చి అడ్డుగా ఆగి వుండకపోతే!-

దాంతో వాళ్ళు మరో ఆలోచనకు ప్రాకులాడుతుండగానే ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన్ అక్కడకు చేరుకోగలిగాడు.

* * *

'....ఇలా అతను తన సామాను పోయినతీరును వెల్లడి జేస్తుండగా ఆటో డ్రయివర్ ఆమెను స్టేషన్‌వద్దకు తీసుకువచ్చాడు—నిజానికి అతను ఆమెను ఓ ప్రయాణీకురాలుగా భావించాడేతప్ప ఆమె మోసంగురించి అతనికి మొదట తెలీదు.

కానీ ఆమె చర్యలను గుర్తించిన ఇద్దరు యువకులు అత్యాశకు పోయి ఆమెను వెంటాడి జనసంచారం లేనిచోట ఆమెను అటకాయించి ఆమెనించి ఆ సామాన్లు తమ స్వాధీనంలోకి తెచ్చుకొని పారిపోయారు....

అయినా ఆటో డ్రయివర్ సూచనలమేరకు హుటాహుటిన బయలుదేరి వెంటాడి వాళ్ళను పట్టుకోగలిగాను, అని చెప్పాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన్—తను ఇంటికి రావడం ఎందుకు ఆలస్యమైనదో వివరణ కోరిన తన భార్యతో.

తన భర్త శక్తియుక్తులకు ఉబ్బిపోతూ అతని చూపుల్లోకి చూసింది శ్రీమతి ఇంద్రసేన్ 'అభినందన'గా.


TRADE MARK
MEXICO
KNITTING MILLS

ఎల్లప్పుడూ - మాచే తయారు చేయబడిన

♦ పావ్‌లిన్ ♦ విజయ్ ♦ సిల్వర్

♦ అనిన్ ♦ బాబి ♦ రోలెక్స్

బనియన్లనే వాడండి. అవి బనియన్లకెల్లా అత్యుత్తమమైనది.

Phone: 22016

MEXICO KNITTING MILLS

43-A, Cauvery St—TIRUPUR - 638602